క్లుప్తంగా

గుడి పనులు త్వరగా ప్రారంభించండి

● కేటీఆర్‌ను కలిసిన ఆలయ కమిటీ



ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయం పునర్‌నిర్మాణం కోసం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కేటీఆర్‌ను కలిశారు. త్వరగా పనులు చేయించాలని విన్నవించారు. కేటీఆర్ మాట్లాడుతూ త్వరలోనే ఆలయ పునర్ నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జెడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, వేణుగోపాలస్వామి ఆలయ చైర్మన్ నంది కిషన్, వైస్‌చైర్మన్ ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, ఎలగందుల నరసింహులు, కోశాధికారి బొమ్మకంటి రవీందర్, ఎడ్ల సందీప్, ఎంపీటీసీలు అనసూయ, నాగరాణి ఉన్నారు. .

జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

కోనరావుపేట: మండలంలోని ధర్మారం జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. గ్రామంలోని దశరథ సేంద్రీయ వ్యవసాయ క్షేత్రం సహకారంతో ఏర్పాటు చేసిన పోటీలను నిర్వాహకులు ఆదర్శ్ కుమార్ ప్రారంభించారు. సుమారు 60 టీంలు పాల్గొనే ఈ పోటీల్లో మొదటి విజేతకు రూ.20 వేలు, రెండో విజేతకు రూ.10 వేలు బహుమతి అందిస్తామన్నారు. వెంగళి వెంకన్న, మిర్యాల్‌కార్ బాలాజీ, ఆసరి ఎల్లయ్య, గంగుల ఎల్లయ్య, బొడ్డు మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ సీసీరోడ్లు

చందుర్తి : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గడప గడపకూ సీసీరోడ్లు నిర్మిస్తామని జెడ్పీటీసీ నాగం కుమార్ అన్నారు. మండలంలోని మల్యాలలో ఈజీఎస్ నిధులు రూ.5లక్షలతో సీసీరోడ్డు నిర్మాణానికి శనివారం భూమిపూజ చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లకు నిధులు కేటాయించామన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, జిల్లా కార్యదర్శి గొట్టె ప్రభాకర్, నాయకులు బొజ్జ మల్లేశం, మల్లారపు రాజయ్య, సంటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శివకల్యాణ వేడుకలు



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

బోయినపల్లి: మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని విలాసాగర్ శ్రీ త్రిలింగ సంఘమేశ్వర స్వామి, బోయినపల్లి శివాలయం, వెంకట్రావుపల్లి శ్రీ రామేశ్వర ఆలయంలో శివకల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు కల్యాణాన్ని తిలకించారు. ఆ యా గ్రామాలకు చెందిన మహిళలు శివపార్వతులకు ఒడిబియ్యం పోశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆ యా ఆలయాల భక్తబృందం తదితరులు ఉన్నారు.

నేడు బీఆర్‌ఎస్ విస్తృతస్థాయి సమావేశం

గంభీరావుపేట: మండలంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు స్థానిక గాయత్రీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్ తెలిపారు. మండలంలోని పార్టీ కార్యకర్తలు, నాయకులు హాజరు కావాలని కోరారు. సమావేశానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ హాజరుకానున్నట్లు తెలిపారు.

వైస్ ఎంపీపీకి సన్మానం



సన్మానిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండల వైస్ ఎంపీపీ జక్కుల కవితను గ్రామంలో ఘనంగా సన్మానించారు. మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు, వార్డు మహిళలు శాలువాతో సత్కరించారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

ముస్తాబాద్: విద్యుదాఘాతంతో మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన రైతు యాదగిరి మృతిచెందగా బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ గ్రామ శాఖ అధ్యక్షుడు చిగురు వెంకన్న కోరారు. సెస్ అధికారులు అండగా నిలిచి కు టుంబాన్ని ఆదుకోవాలన్నారు. రైతులు విద్యుత్‌దాఘాతంతో మృత్యువాత పడుతున్నారని, విద్యు త్ సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు.

అదిరెన్.. డెకరేషన్

● మిరుమిట్లు గొలిపే పందిరి, షామియానాలు
● ఆహూతులను ఆకట్టుకునే డిజైన్లు, పెళ్లి పందిర్లు
● భారీ సెట్టింగులు, పూల డెకరేషన్లు
● డెకరేటర్లకు సీజనల్ ఉపాధి



సండే స్పెషల్

పెళ్లిలో మొదటి ప్రాధాన్యత పందిరిదే. అది లేకపోతే పెళ్లి ఉత్సవం కానరాకుండా పోతుంది. ఒకప్పుడు పెళ్లిళ్లు, ఇంట్లో, గ్రామంలోని ఖాళీ స్థలాల్లో జరిపేవారు. ఇప్పుడు పెళ్లి తంతు కొత్తపుంతలు తొక్కుతోంది. ఆధునిక నాగరికతకు తగ్గట్టుగా పెళ్లి తంతును ఒక్కరోజు ఉత్సవంగా జరుపుతున్నారు. అయితే పెళ్లికి వచ్చేవారు ఔరా అనిపించేలా లేటెస్ట్ డిజైన్లలో రెడీమెడ్ పందిరి, షామియానాలు వేస్తున్నారు. డెకరేటర్లకు డిమాండ్ పెరిగిన నేపథ్యంపై సండే స్పెషల్ కథనం..







సిరిసిల్లటౌన్: గతంలో పెళ్లిలో సంప్రదాయ పద్ధతిలో పచ్చని పందిర్లకు ఎక్కువ ఆదరణ ఉండేది. ఆర్థికంగా ఉన్నవారైతే పూలపందిరి, మరీ సంపన్నులైతే ముత్యాల పందిర్లలో వివాహాలు జరిపేవారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో సాధారణ వర్గాల నుంచి సంపన్నుల వరకు రెడీమేడ్ పందిర్లకే ఇష్టపడుతున్నారు. ఆర్థిక స్తోమతను బట్టి పెళ్లి పందిర్లను ఆహుతులు మెచ్చేలా వేయించుకుంటున్నారు. ఇందుకు పట్టణంలో పూల డెకరేటర్స్, టెంట్‌హౌజ్ నిర్వాహకులు, క్యాటరింగ్ పార్టీలు పెళ్లిపందిర్లు, రిసెప్షన్లకు భారీ సెట్టింగులతో అలంకారం చేస్తున్నారు. భారీ సెట్టింగ్స్‌తో వేస్తున్న పెళ్లిపందిర్లు అదుర్స్ అనిపిస్తున్నాయి.

డిజైన్లలో పందిళ్లు

పెళ్లి పందిర్లు, రిసెప్షన్ పార్టీలకు డెకరేషన్ చేసే పార్టీలకు ఆదరణ పెరిగింది. పెళ్లిళ్లు, పార్టీలు, చిన్న చిన్న శుభకార్యాలకు లెక్కలేనని డిజైన్లలో పందిర్లు కనువిందు చేస్తున్నాయి. శుభకార్యాల్లో అందమైన పందిర్లు, షామియానాలు వేయడం క్రేజ్‌గా మారింది. ఇందుకు సిరిసిల్లలో పదిహేను మంది పెళ్లిపందిర్ల డెకరేటర్లు, పాతికమంది టెంట్‌హౌజ్ నిర్వాహకులున్నారు. వీరుగాక మరో పదిమంది క్యాటరింగ్ పార్టీలున్నాయి. శుభకార్యాలకు డెకరేషన్ చేస్తూ..ప్రత్యక్షంగా, పరోక్షంగా రెండువేల మంది ఉపాధి పొందుతున్నారు.

క్రియేటివ్ డెకరేటర్స్‌కు డిమాండ్

ఏ శుభకార్యం జరిపినా..ఆర్భాటాలు, హంగులు పెరిగాయి. ఒక్కరోజు ఉత్సవం కావడంతో వచ్చిన అతిథులు, బంధువులను ఆకట్టుకోవాలని, తాము జరిపే శుభకార్యం పదికాలాల పాటు మర్చిపోకుండా ఉండాలన్న కాంక్షతో నిర్వాహకులు ఖర్చుకు వెనుకాడటం లేదు. కొందరు క్రియేటివ్ డెకరేటర్స్ ఆధునికతను రంగరిస్తూ..అందమైన డిజైన్లలో పందిర్లు, షామియానాలు వేస్తున్నారు. భారీ సెట్టింగ్స్‌తో ఆర్భాటంగా పెళ్లిళ్లు, శుభకార్యాలు చేయడం నగరాలకే పరిమితం కాకుండా పట్టణాలకు విస్తరించింది. అందుకే సిరిసిల్లలో పెళ్లిపందిర్లు, రిసెప్షన్ సెట్టింగులు అందుబాటులో ఉన్నాయి. విద్యుత్ దీపాల వెలుగుల్లో, రంగురంగుల పూలు, పరదాలతో డెకరేషన్ చేయడం పరిపాటైంది.

మాకు సీజనల్ ఉపాధి



పెళ్లిళ్ల సీజన్‌లోనే ఆర్డర్లు ఉండి బిజీగా ఉంటాం. గిరాకీ మెచ్చే డిజైన్లన్నీ సమకూరుస్తాం. డెకరేషన్ బట్టి పెళ్లి పందిరికి రూ.50వేలు మొదలు రూ.5లక్షల వరకు ధరలున్నాయి. సిరిసిల్లలో ఎక్కువగా పూల డెకరేషన్‌కు ప్రాధాన్యం ఉంటుంది. ఆర్డర్లను బట్టి హైదరాబాద్ నుంచి పూలు తెప్పిస్తాం.

– జలీల్, ఫ్లవర్ డెకరేటర్

క్లాత్ సెట్టింగ్స్‌కు డిమాండ్



ఫంక్షన్ ఏదైనా..క్లాత్‌తో చేసే సెట్టింగ్స్‌ను కోరుకుంటున్నారు. వారి అభిరుచులను బట్టి పందిర్లు, షామియానాలు వేస్తాం. ప్యాకేజీ బట్టి సెట్టింగ్స్ వేస్తాం. కొన్ని సెట్టింగ్స్ కరీంనగర్, హైదరాబాద్ నుంచి తెప్పిస్తాం. మావద్ద ఇరవై మంది వర్కర్లు పనిచేస్తారు. ఒక్కో ఫంక్షన్‌కు రూ.1500 వరకు సంపాదిస్తాం.

– సాయి, క్లాత్ సెట్టింగ్స్ డెకరేటర్

ఘనంగా మల్లికార్జునస్వామి కల్యాణం



ఆలయ ఆవరణలో వేసిన స్వామివారి లగ్నపట్నం

● నాగవెల్లి పట్నం.. అగ్నిగుండ ప్రవేశం
● స్వామివారిని దర్శించుకున్న నేతలు



స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కేటీఆర్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని అల్మాస్‌పూర్‌లోని శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో శనివారం శ్రీ మల్లికార్జునస్వామి–కేతమ్మ, మేడలమ్మ కల్యాణ వేడుకలను వైభవంగా నిర్వహించారు. కల్యాణ వేడుకలకు ఎమ్మెల్యే కేటీఆర్ హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కేటీఆర్‌ను యాదవ సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. ఉదయం లగ్నపట్నం వేశారు. 10 గంటలకు నాగవెల్లి పట్నం, 11గంటలకు అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి కథను భక్తులకు వివరించారు. అనంతరం రేణుక ఎల్లమ్మ–జమదగ్నిల కల్యాణం జరిపించారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సర్పంచ్ రాధారపు పుష్పలత, నాయకులు గుల్లపల్లి నర్సింహారెడ్డి, పిల్లి కిషన్, బైకవేని ఎల్లయ్య, శంకర్, శ్రీనివాస్ యాదవ సంఘం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

'గృహజ్యోతి'ని సద్వినియోగం చేసుకోవాలి

ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వం అమలు చేస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని రాగట్లపల్లి, దుమాల, హరిదాస్‌నగర్, ఎల్లారెడ్డిపేట గ్రామాల్లో శనివారం ఉచిత కరెంట్ బిల్లు పథకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, గుర్రపు రాములు, మహేందర్, సాగర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వారు సంప్రదించాలి

గృహజ్యోతి కింద అర్హులైన వారందరికీ ప్రభుత్వం ఈ పథకాన్ని వర్తింపజేస్తుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. 200 యూనిట్లలోపు విద్యుత్ బిల్లులో మాఫీ ఉంటుందన్నారు. అర్హత ఉండి జీరో బిల్లు రాకపోతే నేరుగా మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు రాజేశం, చెన్ని బాబు, రాజునాయక్, తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): అంకితభావంతో పనిచేస్తేనే ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి తగిన గుర్తింపు లభిస్తుందని ఎక్సైజ్ సీఐ ఎంపీఆర్ చంద్రశేఖర్ అన్నారు. బదిలీపై వెళ్లిన ఆయనతో పాటు కొత్తగా బాధ్యతలు చేపట్టిన సీఐ శ్రీనివాస్‌ను కార్యాలయ సిబ్బంది, గౌడ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు నాగుల ప్రదీప్‌గౌడ్, సభ్యులు గంట బాలాగౌడ్, గంట శ్రీహరిగౌడ్, నాగుల అంజాగౌడ్, గంట సతీశ్ గౌడ్, పందిర్ల సత్తయ్యగౌడ్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.



భక్తులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న వెంకటరమణా రెడ్డి, ఎంపీపీ మానస

తంగళ్లపల్లి: మండలకేంద్రంలోని పురాతన శివాలయం శ్రీ త్రికూటాలయంలో శనివారం సిరిసిల్ల సింగిల్‌విండో వైస్‌చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణారెడ్డి నవ్య దంపతుల ఆధ్వర్యంలో ఎంపీపీ పడిగెల మానసతో కలిసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్లు బండి భాస్కర్ గౌడ్, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రాజన్న, మాజీసర్పంచ్ రవీందర్, కాంగ్రెస్ నాయకులు శివప్రసాద్, మోల లక్ష్మీరాజం, ఎంపీటీసీలు దుర్గాప్రసాద్, నర్సయ్య, ఆంజనేయులు, మ హిళా నాయకులు ఆసాని జయశ్రీ, లావణ్య, కోడం సంధ్యారాణి, పూజారులు దిడ్డి భాస్కర్, శ్రీకాంత్, భక్తులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలం గాలిపల్లికి చెందిన బుర్ర చంద్రమౌళి గౌడ్ ఈనెల 6న గుండెపోటుతో మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని అదే గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు అయ్యన్నగారి హరికృష్ణా రెడ్డి పరామర్శించారు. అనంతరం రూ.5వేలు ఆర్థికసాయంగా అందజేశారు. బుర్ర కనకయ్య, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

నిమ్మపల్లిలో..

కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లికి చెందిన పెంతల రవి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. లైవ్ జిల్లా అధ్యక్షుడు బానోత్ నరేశ్ 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు, రూ.1500 నగదు అందజేశారు. రాములు నాయక్ 25 కిలోల బియ్యం, రూ.వెయ్యి, మోహన్‌నాయక్ 5కిలోల నూనె, నరేశ్‌నాయక్ 25 కిలోల బియ్యం అందించారు.

డ్రైనేజీ పనులకు భూమిపూజ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండలం రేపాకలో జోగు కొమురయ్య ఇంటినుంచి జోగు మల్లయ్య ఇంటివరకు రూ.2 లక్షల ఎంపీటీసీ నిధులతో డ్రైనేజీ నిర్మాణ పనులకు శని వారం ఎంపీటీసీ కథ సుమలత మల్లేశం భూ మిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మొగులోజి దయాసాగర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

ఎల్లారెడ్డిపేట: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని విజ్ఞాన్ పాఠశాల కరస్పాండెంట్ లతీఫ్ అన్నారు. మండలకేంద్రంలోని విజ్ఞాన్ ఇంగ్లిష్‌పాఠశాల విద్యార్థులు శనివారం బాసర శ్రీ సరస్వతి అమ్మవారిని దర్శించుకున్నారు. పదిలో విద్యార్థులు 10 జీపీఏలు సాధించేలా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ శరత్‌కుమార్, ఉపాధ్యాయులు కృష్ణ, సబిత, పీఈటీ భరత్‌కుమార్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బుగ్గ రాజేశుని సేవలో ఆది శ్రీనివాస్



రుద్రంగి: బుగ్గ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఆది శ్రీనివాస్, నాయకులు



చందుర్తి: ఆది శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్

రుద్రంగి(వేములవాడ): మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా శనివారం మండలకేంద్రంలోని శ్రీ బుగ్గ రాజరాజేశ్వర స్వామిని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. బుగ్గ రాజ రాజేశ్వరుని జాతర (తిరునాళ్ళు) ఘనంగా జరిగింది. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు మహా అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శంభు లింగేశ్వరుడి కల్యాణం..

మానాల గ్రామంలో శ్రీ భవాని శంభులింగేశ్వరుని కల్యాణం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య వైభవంగా జరిగింది. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఎన్గల్ శివాలయంలో పూజలు

చందుర్తి (వేములవాడ): మండలంలోని ఎన్గల్ శివాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. మహా శివరాత్రి సందర్భంగా ఆలయం ఆవరణలో నిర్వహించిన శివపార్వతి కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయనను ఆలయ కమిటీ చైర్మన్ గుంటి గంగాధర్ ఘనంగా సన్మానించారు. జెడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్, ఆలయ మాజీ చైర్మన్ కమలాకర్, మాజీ సర్పంచ్ ఎనుగంటి శంకర్, మాజీ ఉపసర్పంచ్ గసికంటి ప్రభాకర్, నాయకులు బొజ్జ మల్లేశం, లాండే తిరుపతి, లాండే సత్తయ్య, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మహదేవ ఆలయంలో..

కోనరావుపేట: మండలంలోని మామిడిపల్లిలో శివ కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా గ్రామంలోని మహదేవ ఆలయంలో స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఆది శ్రీనివాస్ పాల్గొని పూజలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ కొక్కుల భారత, ఉపసర్పంచ్ ఎల్లాల రాంరెడ్డి, అర్చకులు తిరునహరి కృష్ణస్వామి, లక్ష్మణస్వామి, కోచకంటి హరిశర్మ, శివ, భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు.

శివార్చనలో పట్టణ కళాకారులు



కళాకారులను అభినందిస్తున్న మామిడి హరికృష్ణ

వేములవాడ: వేములవాడ రాజన్న సన్నిధిలో తెలంగాణ భాషా–సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రెండ్రోజులపాటు జరిగిన శివార్చన కార్యక్రమంలో స్థానిక కళాకారులు శివ సాక్షాత్కారం అనే నాటక ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకున్నారు. ఈ నాటకంలో సత్య హరిశ్చంద్రుడు బొడ్డు రాములు, సావన్‌పెల్లి శ్రీనివాస్ (కాటికాపరి), నక్షత్రకుడిగా వారాల దేవయ్య, చంద్రమతి పోలీస్ శ్రీనివాస్, శంకరుడిగా కనపర్తి హన్మండ్లు, కాల కౌశికుడిగా గరిగంటి చంద్రయ్య, చిలుముల రమేశ్, భటులుగా వేములవాడ దుర్గయ్య, గుమ్మడి రాజేశం, లోహితాస్యుడుగా వారాల సాత్విక్ సాయిలు నటించారు. వీరితోపాటు మహిళా కళాకారిణులు పడిగల స్వప్న, కోరుట్ల స్వప్న, ఎల్ల లత, సిరికొండ సంధ్య కోలాట ప్రదర్శన నిర్వహించారు. తెలంగాణ భాషా–సాంస్కృతి కశాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, వేములవాడ నృత్య కళానికేతన్ వ్యవస్థాపక అధ్యక్షుడు యెల్ల పోశెట్టి అభినందించారు.

గౌడ ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయండి



ముస్తాబాద్: పోస్టర్ ఆవిష్కరిస్తున్న గౌడసంఘం నేతలు

ఎల్లారెడ్డిపేట: కరీంనగర్‌లో ఈనెల 10న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను సన్మానించే గౌడ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని జిల్లా గౌడ సంఘం ప్రతినిధులు బుర్ర వెంకటేశ్‌గౌడ్, గుగ్గిళ్ల జగన్‌గౌడ్, కందుకూరి దేవదాస్‌గౌడ్ కోరారు. ఎల్లారెడ్డిపేటలో శనివారం స్థానిక గౌడ సంఘం ప్రతినిధులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఉద్యమనాయకుడు పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు మంత్రి పదవి రావడం ఎంతో గర్వకారణమని, ఇది మంత్రిని సన్మానించుకోవాల్సిన సందర్భమన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గంటల కార్తీక్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, నారాయణగౌడ్, దత్తాత్రిగౌడ్, సుధాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: బీసీశాఖ మంత్రి పొన్నం ప్ర భాకర్ గౌడ్ ఆత్మీయ సత్కారం సమావేశానికి జిల్లాలోని గౌడ సామాజిక కుల బాంధవులు తరలిరావాలని మాజీ జెడ్పీటీసీ మెరుగు యాదగిరిగౌడ్ కోరారు. మండలకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఆత్మీయ సత్కారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. బీసీ వర్గాల అభ్యున్నతి కోసం కృషిచేస్తున్న పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను గౌడ ఐక్యవేదిక తరఫున కరీంనగర్‌లోని వీ కన్వెన్షన్‌లో సత్కరించనున్నట్లు తెలిపారు. ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీటీసీ బాలసాని శ్రీని వాస్ గౌడ్, గుగ్గిళ్ల జగన్‌గౌడ్, యాదగిరిగౌడ్, శ్రీనుగౌడ్, పల్లె సత్యం, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పెరిగిన కౌన్సిలర్ల సంఖ్య



సంగ హన్మవ్వ

వేములవాడరూరల్: వేములవాడ మున్సిపాలిటీలో గతంలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి కౌన్సిలర్‌గా 1వ వార్డు నుంచి ఒకే ఒక్కరు సంగ హన్మవ్వ గెలుపొందారు. వేములవాడ పట్టణంతో పాటు శాత్రాజుపల్లి, అయ్యోరుపల్లి, తిప్పాపూర్, నాంపల్లి, కోనాయపల్లి ఐదు గ్రామాలను కలుపుకొని 2020 జనవరి 26న మున్సిపాలిటీ ఎన్నికలు నిర్వహించారు. ఆ సమయంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ నుంచి ఎక్కువ మంది కౌన్సిలర్లుగా గెలుపొందగా మున్సిపాలిటీలో విలీనమైన శాత్రాజుపల్లి 1వ వార్డు నుంచి సంగ హన్మవ్వ కాంగ్రెస్ నుంచి ఒక్కరే గెలు పొందారు. ఒక్క సీటుతో గెలి చిన హన్మవ్వ ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఇప్పటికే ఆరుగురు బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీల నుంచి కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకూ కౌన్సిలర్ల సంఖ్య పెరగడంతో నాడు ఒక్క సీటు ఉండగా నేడు ఏడు సీట్లకు చేరింది.

సంక్షిప్త వార్తలు

ఉపాధిహామీ కార్మికులకు కూలి చెల్లించాలి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఉపాధిహామీ కూలీలకు మూడు నెలలుగా వేతనాలు రావడం లేదని, వెంటనే చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు కోరారు. మండల కేంద్రంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో లక్షా పది వేల మంది ఉపాధి పొందుతున్నారని గత మూడు నెలలుగా వారికి కూలి డబ్బులు జమచేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు.

సీపీఐ మండల కమిటీ ఎన్నిక

మండల కార్యదర్శిగా సోమ నాగరాజు, సహాయ కార్యదర్శిగా బచ్చుపెల్లి శంకర్, కోశాధికారిగా రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు అల్లునూరి రాజయ్య, బాలయ్య, సోమ రాజశేఖర్, వెంకటేశం, ముస్తాబాద్ దేవయ్య, రాములు, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో గిరిజన విద్యార్థులు సేవలు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలకేంద్రంలోని తెలంగాణ గిరిజన గురుకుల సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థినులు మహా శివరాత్రి సందర్భంగా వలంటీర్స్‌గా స్వామివారి సేవలో పాల్గొన్నట్లు ప్రిన్సిపాల్ రజిని తెలిపారు. అనంతరం వారిని అభినందించారు.ప్రిన్సిపాల్ రజిని, వైస్ ప్రిన్సిపాల్ సుధాసింధు, ఎన్‌ఎస్‌ఎస్ పీవో వాణిశ్రీ, కమిటీ మెంబర్ స్పందన, విద్యార్థులు పాల్గొన్నారు.

12 టెండర్

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం శ్రీ హనుమాన్ ఆలయంలో టెంకాయ ముక్కలు పోగు చేసుకునేందుకు బహిరంగ వేలం టెండర్ ఈనెల 12న మధ్యాహ్నం 12 గంటలకు ఆలయం ఆవరణలో నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో మారుతి తెలిపారు. ఈ టెండర్ 15 ఏప్రిల్ 2024 నుంచి 14 ఏప్రిల్ 2025 వరకు డిపాజిట్ సొమ్ము రూ.లక్ష ఉంటుందన్నారు.

చలివేంద్రం ప్రారంభం

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలకేంద్రంలో బీటీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బెంద్రం తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. 14 ఏళ్లుగా వేసవిలో బస్టాండ్ ప్రాంతంలో చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.